www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

పేద కుటుంబాలకు
ఇందిరమ్మ జీవిత భీమా కొండంత అండ



5 లో..

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో
డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్
యూనివర్సిటీ అభివృద్ధి



5 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 294, ఆదివారం 22-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam



ఉచిత ఐవీఎఫ్ చికిత్సతో సంతాన సాఫల్యం

- గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు శిశువుల జననం
- ఏళ్ల తరబడి ఎదురుచూసిన దంపతులకు తల్లిదండ్రులయ్యే అవకాశం
- పేద కుటుంబాలకు ఉచితంగా సంతాన సాఫల్య చికిత్స
- ఇటీవల ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం

2 లో..



మృతులైన గిగ్ వర్కర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

- స్విగ్గీ డెలివరీ భాగస్వామి కుటుంబానికి చేయూత
- ఉబర్ డ్రైవర్ కుటుంబానికి పరిహారం చెక్కు
- కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వ భరోసా
- సామాజిక భద్రతకు కట్టుబడి ఉన్నామని మంత్రి వివేక్ వెల్లడి

2 లో..

కాళోజీ కళాక్షేత్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు చోటు లేదు

* కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకే కేటాయించాలని సీఎం ఆదేశం
* కార్యాలయాల తరలింపుపై వచ్చిన వార్తల నేపథ్యంలో స్పందన
* కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి కార్యక్రమాలు ఖరారు చేయాలని సూచన



హనుమకొండ, నవంబర్ 21 :

ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ఆదేశాలు జారీ చేశారు. కాళోజీ పేరుతో నిర్మించిన కళాక్షేత్రం ఆయన ఆశయాలకు, సాహిత్య స్ఫూర్తికి ప్రతీకగా నిలవాలని, ఆ ప్రాంగణాన్ని ఇతర అవసరాలకు వినియోగించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది.కాళోజీ కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారంటూ వార్తలు వెలువడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి స్పందించారు. ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలించవద్దని కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కళాక్షేత్రం నిర్మాణం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాన్ని దృష్టిలో ఉంచుకుని దాని వినియోగం ఉండాలని సూచించారు. కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పించాలని పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న ప్రజాకవి. తన రచనలు, కవిత్వం, ప్రజా ఉద్యమాల ద్వారా సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారు. ప్రజల భాషలో ప్రజల బాధలను, ఆకాంక్షలను వ్యక్తం చేసిన ఆయన సాహిత్య సేవలకు గుర్తింపుగా హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించారు.

అలాంటి మహనీయుడి స్మారకంగా ఏర్పాటైన ప్రాంగణం ఆయన స్ఫూర్తిని ప్రతిబింబించే కార్యక్రమాలకు వేదిక కావాలన్నది ప్రభుత్వ ఆలోచనగా ఈ ఆదేశాల ద్వారా స్పష్టమవుతోంది. కళాక్షేత్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఫౌండేషన్ సభ్యుల అభిప్రాయాలు, సూచనలు తీసుకుని కళాక్షేత్రాన్ని ఏ విధంగా వినియోగించాలనే అంశంపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కళా ప్రదర్శనలు, సాహిత్య సమావేశాలు, కవుల సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైన వేదికగా దీనిని తీర్చిదిద్దేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి తాజా ఆదేశాలతో కాళోజీ కళాక్షేత్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు అంశానికి తెరపడినట్లయింది. ఈ ప్రాంగణం కళలు, సాహిత్యం, సంస్కృతికి మాత్రమే అంకితం కావాలన్న నిర్ణయం కాళోజీ అభిమానులు, సాహితీవేత్తలు, సాంస్కృతిక రంగాల వారికి ప్రాధాన్యమైనదిగా నిలవనుంది.



తెలంగాణలో 4,000 కోట్ల పెట్టుబడికి సఫ్రాన్ ఆసక్తి

- హైదరాబాద్‌లో ఏరోస్పేస్ తయారీ రంగ విస్తరణకు అవకాశం
- పారిస్‌లో సఫ్రాన్ ప్రతినిధులతో భట్టి విక్రమార్క చర్చలు
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో ఒప్పందంపై ఆశలు

పారిస్, నవంబర్ 21

హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తెలంగాణలో సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో విమాన ఇంజిన్లు, విడిభాగాల తయారీ రంగాలకు మరింత బలం చేకూరనుంది. ఇప్పటికే హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థ తన వ్యాపారాన్ని మరింత విస్తరించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ పెట్టుబడితో రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడటంతో పాటు అంతర్జాతీయ విమానయాన పరిశ్రమలో

మిగతా 2 లో..



మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: జూపల్లి

కల్వకోల్‌లో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు

పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా పండుగ సాయన్న జీవితం

మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజీ, మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు కృషి

కల్వకోల్, నవంబర్ 21

అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో పండుగ సాయన్న విగ్రహాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ఎన్నో అవరోధాలు ఎదురైనా పేదల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం నేటి తరాలకు ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన విగ్రహం కేవలం ఒక ప్రతిమ మాత్రమే కాదని, పేదల ఆత్మగౌరవానికి, హక్కుల సాధన కోసం సాగిన పోరాటానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిబా ఫూలే, పండుగ సాయన్న వంటి మహనీయుల జీవితాలు సమాజానికి మార్గదర్శకమని మంత్రి తెలిపారు. వారి ఆలోచనలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని పేదల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పండుగ సాయన్న వంటి పోరాట యోధుల సేవలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి విగ్రహాల ఏర్పాటు కీలకమని అభిప్రాయపడ్డారు. ముదిరాజ్ సమాజం ఎన్నో ఏళ్లుగా చేసిన కృషి, ఎదుర్కొన్న

మిగతా 2 లో..

మాదకద్రవ్యాల నిర్మూలన జాతీయ ప్రాధాన్యం: కిషన్ రెడ్డి

హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల రహిత భారత్‌పై నగర స్థాయి సదస్సు

యువత, కుటుంబాల భవిష్యత్తుకు డ్రగ్స్ ముప్పు

తెలుగు రాష్ట్రాలకూ విస్తరిస్తున్న మాదకద్రవ్యాల సమస్య

డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని సామూహిక ప్రతిజ్ఞ



హైదరాబాద్, నవంబర్ 21

: మాదకద్రవ్యాల వినియోగం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు, యువతకు, కుటుంబాలకు తీవ్రమైన ముప్పుగా మారుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన మాదకద్రవ్యాల రహిత భారత్ నగర స్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమానికి మద్దతుగా ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని అడ్డుకోవడం, దేశ భద్రతను బలోపేతం చేయడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు మాదకద్రవ్యాల నిర్మూలన కూడా దేశం ముందున్న కీలక ప్రాధాన్యంగా మారిందని వివరించారు. డ్రగ్స్ ప్రభావం వ్యక్తుల జీవితాలకే పరిమితం కాకుండా కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని కూడా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల సమస్య పంజాబ్ రాష్ట్రాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ముప్పు విస్తరిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బస్తీల నుంచి ఐటీ కారిడార్ల వరకు యువతను లక్ష్యంగా చేసుకుంటున్న ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు.

మిగతా 2 లో..

పల్నాడు వాటర్‌గ్రిడ్ పనులు నిలిపివేయాలి

రేవంత్ ప్రభుత్వంపై జలదోపిడీకి సహకరిస్తోందంటూ విమర్శలు

సాగర్ ప్రాజెక్టుపై కవిత వారం రోజుల గడువు

గడువులోగా స్పందించకుంటే వేలాది మందితో డ్యామ్ ముట్టడి హెచ్చరిక

కేంద్ర మంత్రులు, ఎంపీలు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



హైదరాబాద్, నవంబర్ 21

నాగార్జునసాగర్ జలాశయం సమీపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనులను వారం రోజుల్లోగా నిలిపివేయించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేలాది మందితో నాగార్జునసాగర్ డ్యామ్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి వల్లే ఏపీ ప్రభుత్వం జలదోపిడీకి పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. కాకపోతే ఈ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని కోరారు. చంద్రబాబును ప్రజాభవన్‌కు ఆహ్వానించి గౌరవించిన సందర్భంలోనే తెలంగాణ నీళ్లను గురుదక్షిణగా అప్పగిచారని కవిత విమర్శించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలోనూ ముఖ్యమంత్రి అవసరమైన అధికారి విధానాలను పాటించలేదని ఆరోపించారు అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం డిమాండ్ చేయకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో అనధికారిక సమావేశానికి వెళ్లి ఏపీ ప్రాజెక్టుకు అంగీకరించి వచ్చినట్లు విమర్శించారు. ఆ పరిణామాల నేపథ్యంలోనే ఇప్పుడు నాగార్జునసాగర్ జలాలను తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని

మిగతా 2 లో..

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
ఆదివారం
22 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

తెలంగాణలో 4,000 కోట్ల పెట్టుబడికి సఫ్రాన్ ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది.

ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పారిస్ సమీపంలోని ఎవ్రీకార్బెల్‌లో ఉన్న సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ సంస్థ ఉన్నతాధికారులతో సమావేశ మై తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల మైన పరిస్థితులు, ప్రస్తుతం కొనసాగుతున్న కార్యకలాపాల విస్తరణ, కొత్త తయారీ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. పెట్టుబడుల ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు.

బోయింగ్, ఎయిర్‌బస్ వంటి అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలకు ఇంజిన్లు సరఫరా చేస్తున్న సఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ముఖ్యమైన పరి ణామమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హై దరాబాద్‌లో సఫ్రాన్ ఇప్పటికే గణనీయమైన స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరి శ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు తెలంగాణలో అందుబా టులో ఉన్నాయని, అత్యాధునిక మౌలిక సదు పాయాలు కూడా రాష్ట్రానికి అనుకూలంగా ఉన్నాయని వివరించారు. పరిశ్రమలకు వేగంగా అనుమతులు మంజూరు చేసే ప్రభు త్వ విధానాలు పెట్టుబడిదారులకు మరింత భరోసా కల్పిస్తున్నాయని చెప్పారు.

సఫ్రాన్ ప్రతినిధులతో జరిగిన సమావేశం ఫలప్రదంగా సాగిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. డిసెంబర్ 2026లో నిర్వ హించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పారిస్ నుంచి సంస్థ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సదస్సు సందర్భంగా సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనకు సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే పెట్టుబడి ప్రతిపాదనపై చర్చలు కొనసాగుతున్న నే పథ్యంలో ఒప్పందం ఖరారైతేనే తదుపరి కార్యాచరణపై స్పష్టత రానుంది. ఈ ప్రతిపా దనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం సంస్థతో సంప్రదింపులు కొనసాగించనుంది.

ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు. సఫ్రాన్ సంస్థ తరపున ఇండస్ట్రియల్ అండ్ సప్లై చైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లారెంట్ మజౌ, ఇండస్ట్రియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ రొటేటింగ్ పార్ట్స్ డైరెక్టర్ జూలియన్ డి'ఒరాజియో తదితరు లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ పెట్టుబడి ప్రతిపాదన సాకారమైతే హైదరాబాద్ ఏరో స్పేస్ రంగంలో మరింత కీలక కేంద్రంగా ఎదిగేందుకు దోహదపడనుంది. విమాన యాన విడిభాగాల తయారీ, సరఫరా వ్యవ స్థలు, నైపుణ్య ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణకు కూడా మార్గం సుగమం కావచ్చని పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి.

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

అడ్డంకులు, అవమానాల అనంతరం సాధి స్తున్న పురోగతి అభినందనీయమని జూపల్లి కృష్ణారావు అన్నారు. ముదిరాజ్‌లతో పాటు మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీ వర్గీకరణకు సంబంధించి వస్తున్న అభ్యర్థనలను న్యాయ బద్ధంగా పరిశీలిస్తామని తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఆయా వర్గాలకు మెరుగైన అవకాశాలు లభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు అభివృద్ధి సాధించేలా ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు.

చెరువులు, రిజర్వాయర్లపై ఆధారపడి జీవి స్తున్న మత్స్యకారుల ఆదాయం పెరగాలం టే చేపల పెంపకంతో పాటు వాటి నిల్వ, విక్రయాలకు అవసరమైన మౌలిక సదుపా యాలు కల్పించాలని మంత్రి సూచించారు. కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయా ల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం చేపల ఉత్పత్తి చేసిన తర్వాత వాటిని సరైన విధంగా నిల్వ చేయడం, మార్కెట్‌కు తరలించడం వంటి అంశాల్లో మత్స్యకారులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ సదుపాయాలు ఉపయోగపడతాయ ని వివరించారు. చేపలకు మెరుగైన ధర లభించడంతో పాటు వృత్తిపై ఆధారపడిన కుటుంబాల ఆదాయం కూడా పెరుగుతుంద ని పేర్కొన్నారు.కల్వకోల్ పరిసర ప్రాంతాల్లో మత్స్యరంగ అభివృద్ధికి అవసరమైన ప్రణాళి కలు రూపొందిస్తామని జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పథకాలు, అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలించి మత్స్యకా రులకు ప్రయోజనం చేకూర్చే చర్యలు చేపడ తామని తెలిపారు. చేపల పెంపకం నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి దశలో మత్స్యకారు లకు తోడ్పాటు అందించే విధంగా సదుపా యాల కల్పనపై దృష్టి సారిస్తామని చెప్పారు. అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సం దర్భంగా పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవి ష్కరించడం ద్వారా ఆయన పోరాట స్ఫూర్తిని గుర్తుచేసుకోవడంతో పాటు మత్స్యకారులు, ముదిరాజ్ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టు బడి ఉందనే సందేశాన్ని ఇచ్చారు.

మాదకద్రవ్యాల నిర్మూలన జాతీయ ప్రాధాన్యం: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

దేశానికి అత్యంత విలువైన సంపద యువత అని, వారు వ్యసనాలకు బలి కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వాలు మాత్రమే కాకుండా ప్రజలు, కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు కూడా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చా రు. యువతలో అవగాహన పెంచడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజంలో ని ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో భాగస్వా ములు కావాలని కోరారు. ఈ సందర్భం గా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాశ్ నారాయణ ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేస్తామని కిషన్ రెడ్డితో పాటు కార్య క్రమంలో పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ ప్రజా చైతన్య ఉద్యమం మరింత విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు.

పల్నాడు వాటర్‌గ్రిడ్ పనులు నిలిపివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆమె అభిప్రాయపడ్డారు.

తాగునీటి అవసరాల పేరుతో ఏపీ ప్రభు త్వం ఇప్పటికే నాగార్జునసాగర్ నుంచి 2.8 టీఎంసీల నీటిని వినియోగిస్తోందని, ఇప్పుడు లిఫ్ట్ ద్వారా మరో 1.8 టీఎంసీలను తరలిం చేందుకు ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించా రు. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు వద్ద పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం ద్వారా నీటి తరలింపు జరిగిందని గుర్తుచేశారు. ఇప్పుడు సాగర్‌పైనా అదే తరహా ప్రయత్నాలు జరు గుతున్నాయని విమర్శించారు. తొమ్మిది నెలలుగా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నా తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం తెలి యకపోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో నిఘా వ్యవస్థ పని తీరుపైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రాజెక్టు విషయంలో కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు స్పందించాలని కవిత కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ పొత్తులకే ప్రాధాన్యం ఇస్తున్నారా అని ప్రశ్నించారు. ఎంపీ రఘునందన్ రావు, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. తెలంగాణకు చెందిన కేంద్ర ప్ర జాప్రతినిధులంతా ప్రధానమంత్రి వద్దకు వెళ్లి ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని కోరాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ కింద ఈ ప్రాజెక్టుకు కేంద్రం 50 శాతం నిధులు అం దిస్తోందని ఆరోపిస్తూ, ఆర్థిక సహాయాన్ని కూడా నిలిపివేయించేలా ఒత్తిడి తేవాలని అన్నారు.

వారం రోజుల్లోగా పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కవిత స్పష్టం చేశారు. లేకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో వేలాది మందితో నాగార్జునసాగర్ డ్యామ్‌ను ముట్టడిస్తామని ప్రకటించారు. ఆ ఆందోళనకు దారితీసే పరి స్థితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాగా, ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పనులు ని లిపివేయాలని కేంద్ర జలశక్తి శాఖకు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు లేఖలు రాసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

బీఆర్ఎస్‌లోకి ఖైరతాబాద్ నేతలు

- **ప్రవీణ్, శ్రీనాథ్ తదితరులకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానం**
- **రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని ధీమా**
- **హైదరాబాద్ అభివృద్ధి, తాగునీరు, విద్యుత్, వైద్యంపై ప్రభుత్వాన్ని నిలదీత**

హైదరాబాద్, నవంబర్ 21

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎ స్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రా వు ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, శ్రీనాథ్‌తో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. తెలంగాణ భవన్‌లో ప్రతిరోజూ జరుగుతున్న చేరికలే కాంగ్రెస్ బలహీనపడుతోందనడానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ సంస్థ సర్వే నిర్వహించినా బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి వస్తుందని తేలుతోందని, ప్రజలు కేసీఆర్ నా యకత్వం వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రిని ప్రతిపక్షాలు మాత్రమే కాకుండా సొంత పార్టీ ఎమ్మెల్యేలే విమర్శి



స్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ పనితీరు, అవినీతి, లంచాల వ్యవహా రాలపై చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావించారు. రూ.5 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఒక ఎమ్మెల్యే ఆరోపిస్తున్నారని, మరో ఎమ్మెల్యే పనులు కావాలంటే 20 శాతం లంచం ఇవ్వా ల్సి వస్తోందని చెబుతున్నారని పేర్కొన్నారు. సొంత పార్టీ నాయకుల నుంచే విమర్శలు ఎదురవుతుండటంతో ముఖ్యమంత్రి అసహ నానికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసిందని, త్వరలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని కూడా అన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధి, బ్రాండ్ ఇమేజ్ విషయంలో గత బీఆర్ఎస్ పాలనతో ప్రస్తుత ప్రభుత్వాన్ని పోలుస్తూ హరీశ్‌రావు విమ ర్శలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, నగరాన్ని చూసి తాను న్యూయార్క్‌లో ఉన్నానా అని సూపర్ స్టార్ రజనీకాంత్ వ్యాఖ్యానించిన విషయాన్ని గు ర్తుచేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి పాలనలో హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆరోపించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రోజుకు వేల సంఖ్యలో వాటర్ ట్యాం కర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ హయాంలో గోదావరి, కృష్ణా జలాలను తీసుకొచ్చి నగరానికి నీటి సరఫరా చేశామని, ఉచిత నల్లా నీటి పథకం అమలులో ఉండేదని పేర్కొన్నారు. ఇప్పుడు నీటి కొరతతో పాటు విద్యుత్ ఛార్జీల పెంపు, విద్యుత్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గు రిచేస్తున్నాయని విమర్శించారు.నగరంలో పారిశుధ్యం, శాంతిభద్రతలు, వైద్య సదు పాయాలపైనా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఏర్పాటు చేసిన 10 లక్షల సీసీ కెమెరాల్లో ప్రస్తుతం సుమారు ఐదు లక్షలు పనిచేయడం లేదని ఆరోపించారు. నగరంలో దోమల సమస్య, చెత్త నిర్వహణ, తాగునీటి ఇబ్బందులు పెరిగాయని అన్నారు. పరిశ్రమలు, ఐటీ రంగాలకు సంబంధించిన కీలక అధికారుల నియామకాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. బస్తీ దవాఖానాలు, టీ డయాగ్నస్టిక్ కేంద్రాల ద్వారా గతంలో 147 రకాల పరీక్షలు అందించామని, ప్రస్తుతం బస్తీ దవాఖానాల్లో మందులు కూడా అం దుబాటులో లేవని ఆరోపించారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు నిలిచిపో యాయని, టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణం, సేవల పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చె ప్పాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల అమలులోనూ కాంగ్రెస్ ప్ర భుత్వం విఫలమైందని హరీశ్‌రావు విమర్శిం చారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని, రెండు లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక పోవడంతో విద్యార్థుల చదువులు ఇబ్బందు ల్లో పడుతున్నాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం తగిన స్థాయిలో నిధులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

ఉచిత ఐవీఎఫ్ చికిత్సతో సంతాన సాఫల్యం

హైదరాబాద్, నవంబర్ 21

: సంతానలేమితో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న దంపతులకు గాంధీ ఆసుపత్రి ఆశాకిరణంగా నిలుస్తోంది. ఉచితంగా అందిస్తున్న కృత్రిమ గర్భధారణ చికిత్స ద్వారా పలువురు దంపతులు తల్లి దండ్రులయ్యే కలను సాకారం చేసుకుంటు న్నారు. ఇటీవల ఈ చికిత్స ద్వారా ఒక దం పతులకు ముగ్గురు శిశువులు జన్మించడం విశేషంగా నిలిచింది.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా సంతాన సాఫల్య చికిత్స పొందలేకపోతున్న కుటుం బాలకు గాంధీ ఆసుపత్రిలో అందిస్తున్న ఉచిత ఐవీఎఫ్ సేవలు ఎంతో తోడ్పాటు నిస్తున్నాయి. సాధారణంగా ఈ చికిత్సకు అధిక వ్యయం అవుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాంటి వారికి ప్ర భుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందుబాటు లోకి రావడం ఉపశమనంగా మారింది. ఏళ్ల తరబడి సంతానం కోసం ఎదురుచూ సిన దంపతులు చికిత్స అనంతరం తల్లిదం డ్రులుగా మారుతుండటం ఆసుపత్రి వైద్య సేవల్లో కీలక పరిణామంగా నిలుస్తోంది. ఇటీవల ముగ్గురు శిశువులు జన్మించిన ఘటన ఈ సేవలపై మరింత ఆసక్తిని పెంచింది.సంతానలేమితో బాధపడుతున్న కుటుంబాలకు వైద్యపరమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయనే నమ్మకాన్ని కల్పిస్తోంది.

ఈ సేవలను అందించడంలో కృషి చేస్తు న్న వైద్యులు, ఐవీఎఫ్ నిపుణులు, పిండ శాస్త్రవేత్తలు, నర్సులు, గాంధీ ఐవీఎఫ్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి దంపతుల పరిస్థితిని అర్థం చేసుకుని, బాధ్యతతో కూడిన వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది నిబద్ధతను ప్రశంసించారు. వారి సమిష్టి కృషి వల్లే పలువురు కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు మాతృత్వం, పితృత్వం కలలకు అడ్డంకిగా మారకూడదని ఈ సం దర్భంగా అభిప్రాయపడ్డారు. నాణ్యమైన సంతాన సాఫల్య చికిత్స ప్రతి అర్హమైన కుటుంబానికీ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలను అందించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుం బాలకు కూడా మెరుగైన చికిత్స పొందే అవకాశం కల్పించవచ్చని ఈ కార్యక్రమం చాటిచెబుతోంది.

మృతులైన గిగ్ వర్కర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

హైదరాబాద్, నవంబర్ 21

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల కు టుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఇటీవల మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు సంబంధిత సహాయం చెక్కులను కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అందజే శారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. మర ణించిన స్విగ్గీ డెలివరీ భాగస్వామి వల్లూరి సందీప్ కుటుంబానికి మంత్రి ఆర్థిక సహాయం అందించారు. అలాగే విధి ని ర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉబర్ డ్రైవర్ అలుగోలా శ్యామ్ కుటుంబానికి కూడా చెక్కు అందజేశారు. కుటుంబాల జీవనోపాధి కోసం ప్రతిరోజూ శ్రమించే కా ర్మికులు అనేక ప్రమాదాలను ఎదుర్కొంటు న్నారని, వారి కుటుంబాలు అకస్మాత్తుగా ఆధారాన్ని కోల్పోయే పరిస్థితి వస్తోందని మంత్రి పేర్కొన్నారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఎదుర్కొంటున్న ప్రమాదాలు, వారి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సహాయం అందించడం అవసరమని వివేక్ వెంకట స్వామి తెలిపారు. కార్మికులు మరణించిన ప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా కొంతమేర అండగా ని లవవచ్చని చెప్పారు. ఈ సహాయం బాధిత కుటుంబాలకు కష్టకాలంలో తోడ్పడుతుం దని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంతో పాటు, విధి నిర హణలో ప్రమాదాలు ఎదురైనప్పుడు వారి కుటుంబాలను ఆదుకునే చర్యలకు ప్రాధా న్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్ష డు షేక్ సలావుద్దీన్ పాల్గొన్నారు. కారి కుల సంక్షేమం, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ సంకల్పమని మంత్రి పునరుద్ఘాటించారు. గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా మరిన్ని చర్యలు అవసరమని ఈ సందర్భంగా ప్రస్తా వించారు.

ఒక్క ఫొటో వేల భావాలను పలికిస్తుంది

- **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

హైదరాబాద్, నవంబర్ 21

ఒక వార్తను వందల పదాలతో వివరించవచ్చని, అదే విషయాన్ని ఒక్క ఫొటో క్షణాల్లోనే వేల భావాలతో ప్రజల హృ దయాలకు చేరవేస్తుందని తెలంగాణ శాస నసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చరిత్రలోని కీలక ఘట్టాలను భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బాధ్యత ఫొటో జర్నలిస్టులపై ఉందని కొనియాడారు. హైద రాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటో జర్నలిస్టుల అవార్డుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఫొటో జర్నలిజం సమాజంలోని వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించే శక్తివంతమైన మాధ్యమమని వివరించారు. ఒక సంఘటనలోని ముఖ్యమైన క్షణాన్ని చిత్ర రూపంలో బంధించి ప్రజలకు చేరవే యడం ప్రత్యేక నైపుణ్యంతో కూడుకున్నదని అన్నారు. చరిత్రలో నిలిచిపోయే అనేక ఘట నలకు ఫొటోలు సాక్ష్యాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.మారుతున్న సాంకేతిక పరిజ్ఞా నానికి అనుగుణంగా ఫొటో జర్నలిస్టులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని సూచించారు. కొత్త సాం కేతికతను అందిపుచ్చుకుంటూ వృత్తిలో మరింత నైపుణ్యం సాధించాలని ఆకాంక్షిం చారు. వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొ నేందుకు నిరంతర అభ్యాసం అవసరమని తెలిపారు.ఫొటో జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు తెలంగాణ ప్రజా ప్రభు త్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టులు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి, వారి సమస్యల పరిషా రానికి ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. మీడియా రంగంలో పనిచేస్తున్న వారి వృత్తిపరమైన గౌరవం, భద్రతకు ప్రా ధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొ న్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొ టోగ్రఫీ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఫొటో జర్నలిస్టులకు స్పీకర్ అవార్డులు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, జర్నలిసు సంఘాల ప్రతినిధులు, ఫొటో జర్నలిస్టులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



చర్లలో బెల్టు షాపుల దందా..

- అధికారుల అండదండలతోనే అక్రమ మద్యం విక్రయాలా?
- బస్టాండ్ నుంచి గుడి వీధుల వరకు బెల్టు షాపుల జోరు
- బాలికల వసతి గృహం రహదారిలోనూ మద్యం విక్రయాల ఆరోపణలు
- తెలంగాణ మద్యం ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్నా పట్టించుకోని ఎక్సైజ్ శాఖ?
- బెల్టు షాపులు మూసివేయకపోతే ఆందోళనలు తప్పవు: సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ



చర్ల, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్): చర్ల మండల కేంద్రంలో బెల్టు షాపుల అక్రమ మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బస్టాండ్ సెంటర్ నుంచి దేవాలయాల పరిసరాలు, ప్రధాన రహదారులు, విద్యార్థినులు రాకపోకలు సాగించే మార్గాల వరకు బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగంగా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి సంతపురి సురేష్ ప్రశ్నించారు. చర్ల బస్టాండ్ సెంటర్, సాయిబాబా టెంపుల్ రోడ్, పాత చర్ల గాంధీ బొమ్మ సెంటర్, అంబేద్కర్ నగర్ గర్ల్స్ హాస్టల్ రోడ్, చిన్న నీలా కీలాద్రి రోడ్ తదితర ప్రాంతాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లోనే మద్యం విక్రయాలు జరగడంతో మహిళలు, విద్యార్థులు, భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులకు కనిపించని అక్రమ మద్యం వ్యాపారమా?

ప్రభుత్వం మహిళల భద్రత, విద్యార్థుల రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతుంటే, క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని సురేష్ విమర్శించారు. ముఖ్యంగా బాలికల వసతి గృహానికి వెళ్లే రహదారిలో సైతం మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇంత బహిరంగంగా అక్రమ వ్యాపారం సాగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం వెనుక కారణాలేమిటని ప్రశ్నించారు.

ఛత్తీస్‌గఢ్‌కు మద్యం అక్రమ రవాణా?

చర్ల మండల కేంద్రం నుంచి పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌కు తెలంగాణ మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని సురేష్ తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమ రవాణా జరుగుతుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

బెల్టు షాపులను తక్షణమే తొలగించాలి

చర్ల మండల కేంద్రంలోని బెల్టు షాపులన్నింటినీ తక్షణమే మూసివేయాలని, అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు. కేవలం నామమాత్రపు తనిఖీలతో సరిపెట్టకుండా అక్రమ మద్యం విక్రయాల వెనుక ఉన్న మూలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల పక్షాన పోరాటం తప్పదు

ఇకనైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి బెల్టు షాపులను పూర్తిస్థాయిలో అరికట్టాలని, లేనిపక్షంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేపడతామని సంతపురి సురేష్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, మహిళల భద్రత, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రతి గడపకు వివాహ ఆహ్వానం.. ప్రతి కుటుంబానికి ఆత్మీయ పిలుపు!

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక ఆకాంక్ష మేరకు సింగరేణి మండలవ్యాప్తంగా శుభలేఖల పంపిణీ.. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం



కారేపల్లి, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్ -- రాములు):

ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, ప్రతి కుటుంబాన్ని తన కుటుంబ సభ్యులుగా భావించే వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ తన పెద్ద కుమార్తె డాక్టర్ మాలోత్ గాయత్రి వివాహ మహోత్సవానికి సింగరేణి మండలంలోని ప్రతి కుటుంబాన్ని వ్యక్తిగతంగా ఆహ్వానించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం మండలవ్యాప్తంగా వివాహ ఆహ్వాన పత్రికల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రతి గడపకు శుభలేఖ అందజేస్తూ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యను ప్రత్యేకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా కారేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నునావత్ సాగర్, ఎస్సై వి. రమేష్, పగడాల మోహన్ కృష్ణతో పాటు మండలంలోని



గ్రామపంచాయతీల సర్పంచులు, మండల స్థాయి నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రముఖులు, ప్రజలకు శుభలేఖలు అందజేశారు. నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారి సంతోషాల్లో భాగస్వాములవుతున్న ఎమ్మెల్యే ఆకాంక్ష మేరకు ప్రతి గ్రామంలోనూ, ప్రతి కుటుంబానికి వివాహ ఆహ్వానం అందేలా నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కేవలం ప్రముఖులకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల ఇళ్లకు సైతం వెళ్లి ఆహ్వానించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతగా నిలిచింది. డిసెంబర్ 3వ తేదీన వైరాలో జరగనున్న డాక్టర్ మాలోత్ గాయత్రి వివాహ మహోత్సవానికి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూరి రాంబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు రవీంద్ర, ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు మేదరి రాజా తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని రద్దు చేసే కుట్రలను తిప్పికొట్టాలి

- ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి పరిరక్షణకు ఐక్య పోరాటం
- నవంబర్ 30న వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలి
- ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు.. కరపత్రం ఆవిష్కరణ





వెంకటాపురం, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్): ఆదివాసీల భూమి, హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం రాజ్యాంగం కల్పించిన చట్టాలను సంపూర్ణంగా అమలు చేయాలని, 1/70 చట్టాన్ని రద్దు చేయాలంటూ గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆదివాసీ సమాజం అప్రమత్తమై ఐక్యంగా ఉద్యమించాలని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల ప్రత్యేక హక్కులను, చట్టబద్ధమైన రక్షణలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. నవంబర్ 30న ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్న నేపథ్యంలో శనివారం ఆదివాసి సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ ఉద్యమం కేవలం ఒక సంఘానికో, ఒక ప్రాంతానికో పరిమితమైనది కాదని, ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదిమ తెగల భవిష్యత్తుకు సంబంధించిన కీలక పోరాటమని పేర్కొన్నారు.

1/70 చట్టం ఆదివాసీలకు రక్షణ కవచం

1/70 చట్టం కేవలం ఆదివాసీల భూములను కాపాడటానికే పరిమితమైన చట్టం కాదని, తరతరాలుగా ఆదివాసీలు అనుభవిస్తున్న హక్కులు, వారి ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక అస్తిత్వాన్ని కాపాడే రాజ్యాంగబద్ధమైన రక్షణ వ్యవస్థలో కీలక భాగమని నాయకులు వివరించారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు ఆదివాసీల జీవనాధారాలను పరిరక్షించడంలో ఈ చట్టానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. అటువంటి చట్టాన్ని రద్దు చేయాలని గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఆదివాసీల హక్కులు, భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ పరిణామాలను ఆదివాసీ సమాజం నిర్లక్ష్యం చేయకూడదని, చట్ట పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా గళమెత్తాలని పిలుపునిచ్చారు.

-చట్టాలు కాగితాలకే పరిమితం కాకూడదు :

ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమలులో ఉండాల్సిన 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు, ఆదివాసీల భూములపై ఉన్న హక్కులు, అటవీ వనరులపై వారి ఆధారపడిన జీవన విధానానికి తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

= ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని భూములు, అడవులు, ఖనిజ సంపదపై ఆదివాసీలకు ఉన్న హక్కులను కాపాడాల్సింది పోయి, వాటిని నిర్వీర్యం చేసే విధానాలకు ప్రభుత్వాలు పరోక్షంగా అవకాశం కల్పిస్తున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల అనుమతి, గ్రామసభల నిర్ణయాలు, చట్టబద్ధమైన ప్రక్రియలకు ప్రాధాన్యత ఇవ్వకుండా అభివృద్ధి పేరుతో వారి హక్కులకు విఘాతం కలిగించరాదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ మౌనం ఆదివాసీల భవిష్యత్తుకు ప్రమాదకరం

1/70 చట్టం రద్దు అంశంపై ఆదివాసీలలో నెలకొన్న ఆందోళనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కులకు ముప్పు ఏర్పడుతున్న సమయంలో ప్రభుత్వాలు స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడం ఆందోళనకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టాలకు సంపూర్ణ రక్షణ కల్పించాలని, ఆదివాసీల భూములు, అటవీ హక్కులు, సంప్రదాయ ఆచార వ్యవహారాలను కాపాడాలని కోరారు. ఇప్పటికైనా ఆదివాసీ సమాజం మౌనం వీడాలని, తమ హక్కుల కోసం ప్రశ్నించాలని, రాబోయే తరాలకు భూమి, అడవి, సంస్కృతి, అస్తిత్వాన్ని వారసత్వంగా అందించాలంటే ఐక్య పోరాటమే మార్గమని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఆదివాసీ సంఘాలు, ప్రజాస్వామికవాదులు, ప్రజాప్రతినిధులు, మేధావులు ఒకే వేదికపైకి వచ్చి ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరారు.

నవంబర్ 30 ముట్టడిని విజయవంతం చేయాలి

ఆదివాసీల చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణ, 1/70 చట్టం రక్షణ, ఐదో షెడ్యూల్డ్ చట్టాల సంపూర్ణ అమలు, పీసా చట్టం అమలు, అటవీ హక్కుల గుర్తింపు వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం నవంబర్ 30న వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ముట్టడి కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ ఉద్యమం ఆదివాసీల భవిష్యత్తు తరాల హక్కులకు సంబంధించినదని, నేటి పోరాటం రేపటి తరాల మనుగడకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. **కరపత్ర ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు :** ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జాతీయ నాయకులు యాసం రాజు, జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన సర్వేశ్వరరావు, బొగ్గుల భిక్షపతి, మండల అధ్యక్షుడు కణితి వెంకటకృష్ణ, ఆదివాసి నవ నిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నరసింహమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు, జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, ఉపాధ్యక్షుడు కంతి విజయ్, గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, మండల నాయకులు పూనెం నితిన్, బి. నరసింహమూర్తి, ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్, మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు, తుర్స ప్రశాంత్, సూర్య తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణే లక్ష్యం.. ఐక్య పోరాటమే మార్గం అనే నినాదంతో నవంబర్ 30న జరిగే వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని నాయకులు మరోసారి పిలుపునిచ్చారు.

జగన్, షర్మిల మధ్య మరింత ముదిరిన యలహంక ప్యాలెస్ వివాదం

నవంబర్ 21



(భద్రాద్రి న్యూస్): : వైకాపా అధినేత జగన్, ఆయన సోదరి షర్మిల మధ్య యలహంక ప్యాలెస్ వివాదం మరింత ముదిరింది. బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లోకి షర్మిల రాకుండా స్టే ఇవ్వాలని జగన్ కోర్టుకెక్కారు. దేవనహళ్లి కోర్టులో సిలికాన్ బిల్డర్స్ లిమిటెడ్ పేరుతో పిటిషన్ వేశారు. తన కుమార్తె పెళ్లి పనుల్లో భాగంగా షర్మిల ఆదివారం యలహంక ప్యాలెస్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసి.. ఆమెను అడ్డుకునేందుకు జగన్ కోర్టును ఆశ్రయించారు. యలహంక ప్యాలెస్‌లో తన కుమార్తె వివాహం జరిపించాలని షర్మిల భావించినప్పటికీ.. జగన్ అభ్యంతరం చెప్పడంతో ఇప్పటికే అంజిలి వివాహ వేదికను మార్చుకున్నారు. తాజాగా.. షర్మిల యలహంక ప్యాలెస్‌లో అడుగు పెట్టకుండా చేసేందుకు జగన్ కోర్టును ఆశ్రయించడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగామారింది. 2019లో ఒప్పందం ప్రకారం ప్యాలెస్‌పై యాజమాన్య హక్కులు తనకే ఉన్నాయని షర్మిల చెబుతున్నారు.

తన నివాసమని జగన్ చెప్పటంతో వివాదం.. : షర్మిల తన కుమార్తె అంజిలి వివాహాన్ని యలహంక ప్యాలెస్‌లో చేయాలని నిర్ణయించుకుని ఆ వేదిక వివరాలతో ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధుమిత్రులకు పంచగా.. అక్కడ పెళ్లి చేయడానికి వీల్లేదంటూ జగన్ అడ్డుపడిన సంగతి తెలిసిందే. 'నేను నివసిస్తున్న ప్రాంగణంలో పెళ్లి చేస్తే తీవ్ర భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయి. అందరిదృష్టి నా నివాసంపై పడుతుంది. ఇది నా ఇల్లు, ఇక్కడ నా కుటుంబం సురక్షితంగా ఉండేలా నేను చూసుకోవాలనుకుంటున్నాను' అంటూ షర్మిలకు జగన్ లేఖ రాశారు. ఇదిలా ఉండగా.. బెంగళూరులోని యలహంక భూమి తన కుమార్తె షర్మిలదేనని మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి విజయమ్మ గతంలోనే వెల్లడించారు. తన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి.. షర్మిలకు రాసిచ్చిన ఎంవోయూలోని ప్రతి ఆస్తితో పాటు సరస్వతి సిమెంట్ సహా ఎంవోయూలో లేని యలహంక భూమి కూడా షర్మిలదేనని ఆమె ఇదివరకే తేల్చిచెప్పేశారు. ఈ మేరకు ఈ ఏడాది మార్చి 20న 'క్లారిఫికేషన్' పేరిట ఆమె బహిరంగ ప్రకటన కూడా విడుదల చేశారు. అప్పట్లో న్యాయవాదితో నోటరీ చేయించి మరీ ఆమె ఈ ప్రకటన విడుదల చేశారు. కుమార్తె పెళ్లి పనుల కోసం యలహంక ప్యాలెస్‌లోకి వెళ్లేందుకు షర్మిల ఆదివారం బెంగళూరు వెళ్తున్న నేపథ్యంలో దేవనహళ్లి కోర్టు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

విద్యార్థుల ఇబ్బందులపై తక్షణ స్పందన..

- పాఠశాల ఆవరణలో మొరం పోయించిన సర్పంచ్ టోనీ!
- సమస్యను గుర్తించిన వెంటనే పరిష్కార చర్యలు.. మాటల్లో కాదు చేతల్లోనే గ్రామాభివృద్ధి చూపిస్తున్న మేదరి వీర ప్రతాప్



కారేపల్లి, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్ -- రాములు): ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే లక్ష్యంగా సింగరేణి గ్రామపంచాయతీ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యపై స్పందించి పాఠశాల ఆవరణలో మొరం పోయించి చదును చేయించారు. సింగరేణి గ్రామపంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షం కురిసిన ప్రతిసారీ నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. దీంతో విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన సర్పంచ్ పాఠశాల ఆవరణలో మొరం పోయించి చదును చేయించారు. దీంతో విద్యార్థుల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగడంతో పాటు పాఠశాల పరిసరాలు మెరుగుపడ్డాయి. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపడం పట్ల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి క్షేత్రస్థాయిలో స్పందిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని సర్పంచ్ టోనీ చాటుతున్నారు.

ప్రజల రక్షణే పోలీసుల లక్ష్యం -- ప్రజల సహకారమే పోలీసుల బలం

- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 50వ డివిజన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు ఎస్పి మరియు డిఎస్పి ఆదేశాల మేరకు వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలు మరియు స్పెషల్ పార్టీ బృందం ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని 50వ డివిజన్ పరిధిలోని నెహ్రూ బస్తీ, రామటాకీస్ ,ఏరియా ప్రాంతంలో విస్తృతంగా ప్రత్యేక తనిఖీలు మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని కొన్ని ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, అనుమానాస్పదంగా సంచరించే గుర్తు తెలియని వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్ పాల్గొని, పోలీసుల సూచనలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా పోలీసు ఎస్పి మరియు డిఎస్పి, వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలు మరియు స్పెషల్ పార్టీ పోలీస్ బృందానికి 50వ డివిజన్ కార్పొరేటర్ డి. శ్రీనివాస్ హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
ఆదివారం
22 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మేఘన ఎంపిక

- మద్దులపల్లి జడ్పీహెచ్ఎస్
పాఠశాల బాలిక మేఘనకు స్థానిక ప్రజల అభినందనలు



కామేపల్లి, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్):- ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజక వర్గం లోని కామేపల్లి మండలం పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన మద్దులపల్లి గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పొడుగు మేఘన రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు ఎంపికైంది.ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో మేఘన పాల్గొననుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రమేష్,పిటి అంజయ్య,బి. రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ప్రజా ప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు స్థానిక ప్రజలు మద్దులపల్లి మాజీ కబడ్డీ క్రీడాకారులు మేఘనను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మహిళా సంఘాల బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి

- అజంతా మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఏపీఎం వెంకట్రామారావు



కామేపల్లి, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్): కామేపల్లి మండల కేంద్రం రైతు వేదికలో అజంతా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నెలవారీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సమాఖ్య అధ్యక్షురాలు కె.ఉషశ్రీ అధ్యక్షత వహించారు. అనంతరం ఈ సందర్భంగా ఏపీఎం ఎం. వెంకట్రామారావు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, పొదుపులు,అంతర్గత రుణాల చెల్లింపులు, బ్యాంకు లింకేజీ,రుణాల సకాలంలో చెల్లింపు, మహిళల ఆర్థిక అభివృద్ధి,జీవనో ఉపాధి పెంపుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరించారు. సెర్ప్ ఆధ్వర్యంలో అమలవుతున్న కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల నిర్వహణ, రికార్డుల నిర్వహణ,ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పాటించాలని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీ పీఓ కె.ఉమా మాట్లాడుతూ చిన్నారులందరికీ విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని,వారి భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళలు గర్భిణులు బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ప్రతి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్యవివాహాలను అరికట్టాలని, గర్భిణులు,బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు పిల్లలకు సరైన పోషకాహారం అందించాలని తెలిపారు. రక్తహీనత నివారణ చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య,ఆరోగ్య పరీక్షలు,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అంగన్వాడి సూపర్‌వైజర్లు టి.విజయలక్ష్మి,పి. వరలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తీసుకుంటున్న చర్యలను వివరించారు. మండల సమాఖ్య కార్యదర్శి జర్పుల సరోజ, కోశాధికారి వీసం శ్రావణి,సీసీలు బి.చైతన్య, కె.పుష్పకుమారి, కె.సరోజిని, వై.నాగమణి, జె.శోభ,వై.ఉప్పలమ్మ,అకౌంటెంట్ సీహెచ్.కౌసల్య, వై.వంశీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేకంగా మహిళా సంఘాల అభివృద్ధి,సభ్యుల ఆర్థిక స్వావలంబన, మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ,ప్రభుత్వ పథకాల సద్వినియోగం కోసం సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ బీమా కొండంత భరోసా!

- రూ.5 లక్షల జీవిత బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక రక్షణ -- తోటకూరి రాంబాబు
- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి



కారేపల్లి, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్ -- రాములు): నిరుపేద కుటుంబాల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఆపద సమయంలో అండగా నిలిచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఎంతో దోహదపడుతుందని కారేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు అన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా బీమా పరిహారం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం భవిష్యత్తుపై భరోసా కల్పిస్తుందని వివరించారు. వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సహకారం, చొరవతో కారేపల్లి మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ఇందిరమ్మ బీమా పథకానికి సంబంధించి అర్హతలు, దరఖాస్తు విధానం తదితర వివరాలను తెలుసుకొని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లబ్ధి పొందాలని సూచించారు. ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తోటకూరి రాంబాబు స్పష్టం చేశారు.

ప్రజల మధ్యే మనీషా లక్ష్మి.. ఆత్మీయ పలకరింపులతో సింగరేణిలో ప్రత్యేక గుర్తింపు!

- తండ్రి మదన్ లాల్ అడుగుజాడల్లో ప్రజలతో మమేకం.. గృహప్రవేశ వేడుకకు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు



కారేపల్లి, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్ -- రాములు): ప్రజలతో మమేకమవుతూ, వారి కుటుంబ శుభకార్యాల్లో భాగస్వాములవుతూ ఆత్మీయ అనుబంధాలను పెంపొందించుకుంటున్న బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ సింగరేణి మండల పర్యటనకు స్థానికుల నుంచి ఆదరణ లభిస్తోంది. తండ్రి మదన్ లాల్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగుతున్నారు. మండల పర్యటనలో భాగంగా గణితి ముత్యాలరావు గృహప్రవేశ వేడుకకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమాని కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానికులతో కొద్దిసేపు ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ వారి సంతోషాల్లో భాగస్వాములయ్యారు. తండ్రి మదన్ లాల్ ప్రజలతో కొనసాగించిన అనుబంధాన్ని కొనసాగిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలతో నేరుగా మమేకమవుతున్న మనీషా లక్ష్మి కలుపుగోలుతనం స్థానికులను ఆకట్టుకుంటోంది. హోదాలకు, ఆర్భాటాలకు దూరంగా ప్రజల మధ్యకు వెళ్లి ఆత్మీయంగా పలకరించడం ద్వారా తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు ఉన్నం వీరేందర్, వాంకుడోత్ జగన్ నాయక్, మాజీ ఎంపీటీసీ బానోత్ శంకర్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గంతి సత్యనారాయణ, జిల్లా నాయకుడు డొంకెన రవీందర్, జైత్రం తండా సర్పంచ్ బానోత్ మంగ, చిన్న మాలోత్ స్వామి, మణికొండ నాగేశ్వరరావు, పాలిక వీరస్వామి, పేర్ని వెంకటేశ్వర్లు, శంకర్, జడల కళ్యాణ్, సోమందల నాగరాజు, గుగులోత్ జుంకీలాల్, భూక్య మధు, బావ్ సింగ్, పొడుగు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సోదరులకు ఎలాంటి నష్టం జరగకుండా బుగ్గ వాగు ప్రాజెక్టు భూసేకరణ చేపడతాం

- రైతులు ప్రభుత్వానికి సహకరించాలి
- జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం



కామేపల్లి, నవంబర్ 21 (భద్రాద్రిన్యూస్):- రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా బుగ్గవాగు ప్రాజెక్టు భూసేకరణ చేపడుతున్నామని రైతులు ప్రభుత్వానికి సహకరించాలని ఖమ్మం జిల్లా భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి. సదానందం వెల్లడించారు. మండలంలోని బుగ్గ వాగు ప్రాజెక్ట్ నుండి తీసుకొచ్చే భూమి లోపల అండర్ గ్రౌండ్ నీటి పైపు లైన్ వేసి దాని ద్వారా చెరువులు నింపడానికి పింజరమడుగు ,నెమలిపురి, గోవింద్రాల,పాత లింగాల, కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీలలో శనివారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ బుగ్గ వాగు నుండి వృధాగా పోతున్న నీటిని ఈ గ్రామాల్లో ఉన్న చెరువులకు నీటిని మళ్లించి వాటిని నింపి రైతులకు రెండు పంటలు పండే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఇప్పటికే మండలంలో సీతారామ ప్రాజెక్ట్,బుగ్గ వాగు ప్రాజెక్ట్ ద్వారా మండలం లోని భూములు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు.భూ సర్వేలు పూర్తయిన వెంటనే రైతు కోల్పోయిన భూములకు రావలసిన నష్టపరిహారాన్ని చెల్లిస్తామని వెల్లడించారు.ఈ భూ సేకరణ సభల్లో రైతులు లేవనెత్తిన పలు అంశాలకు వారు సమాధానం చెప్పారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో సోమ్ లాల్,కొమ్మినేపల్లి సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు ఇరిగేషన్ డి ఈ వెంకన్న నాయక్. ఆర్ ఐ క్రాంతి. ఇరిగేషన్ ఏఈ లు నాగయ్య,సందీప్ వర్క్‌ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆయా గ్రామ పంచాయతీ సర్పంచులు జిపిఓ లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : గ్రామాలు, బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని బాబు క్యాంప్, ఎన్కే నగర్ గ్రామాల్లో రూ. 79. 50 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బాబు క్యాంప్‌లో రూ. 43 లక్షలతో 8 సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, రూ. 10 లక్షలతో వీఓ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే మినీ వాటర్ స్కీమ్, సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్ పనులను ప్రారంభించారు. గ్రామాల్లో తాగునీరు, రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామని, మహిళా సంఘాల బలోపేతానికి, పేదల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డీపీఓ బి.అనూష, ఎంపీడీఓ శుభాషిణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ఆపద సమయంలో పేద కుటుంబాలకు జీవిత బీమా పథకం ఆర్థిక భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం బాబు క్యాంప్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే పథకం లక్ష్యమన్నారు. అర్హులందరూ పథకంలో నమోదు చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, నమోదు ప్రక్రియను వేగవంతం చేసి పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు.

సర్వయ్య ఆశయాలను కొనసాగిస్తాం

- ?సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య



కామేపల్లి, నవంబరు 21 (భద్రాద్రి న్యూస్):- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సీనియర్ నాయకుడు,ప్రజా ఉద్యమాల సహచరుడు కామ్రేడ్ పగిడిపల్లి సర్వయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య స్పష్టం చేశారు. శనివారం మండలంలోని కొత్తలింగాల గ్రామంలో గల ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో కామేపల్లి--కారేపల్లి సంయుక్త మండలాల సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్ అధ్యక్షతన నిర్వహించిన సర్వయ్య సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు సర్వయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సి.వై. పుల్లయ్య మాట్లాడుతూ, కామ్రేడ్ పగిడిపల్లి సర్వయ్య జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో, ఎర్రజెండా పట్ల అచంచల విశ్వాసంతో పనిచేశారని కొనియాడారు. గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణానికి, ప్రజా ఉద్యమాల బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని గుర్తుచేశారు. వయసు పైబడినా, అనారోగ్య సమస్యలు వేధిస్తున్నా పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. మేడే కార్యక్రమాలు, అమరవీరుల సభలు,పార్టీ మహాసభలతో పాటు అనేక ప్రజా పోరాటాల్లో ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. సర్వయ్య మరణం పార్టీకి తీరని లోటని, ఆయనలాంటి సాధారణ కార్యకర్తల త్యాగాల పునాదులపైనే కమ్యూనిస్టు ఉద్యమాలు నిలబడతాయని చెప్పారు.ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.

?ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్,శివలింగం, ఎస్.కే. లాల్‌మియా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ,ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎడ్లపల్లి ఉపేందర్,కేలోతు లక్ష్మణ్,మండల నాయకులు వడ్డే వెంకటేశ్వర్లు, ధరావత్ సక్రు, జరుకుల రామ్‌సింగ్, వీరయ్య,రాజేష్, సక్రం,కృష్ణ,రాజు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



రుద్రంపూర్‌కు పిన్‌కోడ్ సమస్య

-- స్మార్ట్ రేషన్ కార్డుల్లో 507118తో ప్రజలకు ఇక్కట్లు
-- ఆధార్, బ్యాంకు ఖాతాలు, ఉద్యోగ దరఖాస్తుల్లోనూ తప్పని అవస్థలు
-- పోర్టల్‌లో పిన్‌కోడ్ సరిచేయాలని డిమాండ్





కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పుగా నమోదవుతున్నాయి. పోస్టల్ పిన్‌కోడ్ స్థానిక ప్రజలకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన అసలు పోస్టల్ పిన్‌కోడ్ 507119 కాగా, ప్రస్తుతం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో 507118గా ముద్రించి ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తప్పిదం భవిష్యత్‌లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సేవలు పొందే సమయంలో ఇబ్బందులకు దారితీసే ప్రమాదం ఉందని రుద్రంపూర్ ఉప సర్పంచ్ తోటరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రుద్రంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బానోత్ కేస్లీ అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సభ రూపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ తోటరాజు మాట్లాడుతూ... రుద్రంపూర్ పంచాయతీకి సంబంధించిన పోస్టల్ పిన్‌కోడ్ విషయంలో చాలా కాలంగా సమస్య కొనసాగుతోందని తెలిపారు. గ్రామానికి వాస్తవంగా 507119 పిన్‌కోడ్ ఉండగా, ప్రభుత్వ సంబంధిత పోర్టళ్లలో మాత్రం ఈ నంబర్ కనిపించకపోవడంతో వివిధ సందర్భాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఈ సమస్యను అధికారులు ఇకనైనా గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సర్పంచ్ బానోత్ కేస్లీ చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌతంపూర్ సర్పంచ్ ఎస్. కళ్యాణి, ధన్‌బాద్ పంచాయతీ సర్పంచ్ గుగులోతు జ్యోతి, ఉపసర్పంచులు ప్రేమ్ కుమార్, గంగారాం, రుద్రంపూర్ పంచాయతీ కార్యదర్శి నరేందర్, జీపీఓ గోపాల్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుండే శ్రమ, క్రమశిక్షణ అలవర్చుకోవాలి

-- కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : విద్యార్థులు చిన్ననాటి నుండే శ్రమ, క్రమశిక్షణ అలవర్చుకుని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తద్వారా తల్లిదండ్రుల కలలను నెరవేర్చడంతో పాటు దేశ సేవకు సిద్ధం కావాలని కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. విద్యార్థుల్లో స్వీయ రక్షణ, నైతిక విలువల పెంపుదలపై అవగాహన కల్పించడంలో భాగంగా శనివారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 12వ వార్డు సుభాష్ చంద్రబోస్ నగర్‌లో గల స్వర్ణ భారతి మోడ్రన్ ఇఖ్రా పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి కష్టమే రేపటి సుఖాలకు వారధి అని, విద్యార్థులు ప్రతిరోజూ పాఠాలను అదే రోజు చదువుకోవాలని సూచించారు. చదువులో సందేహాలు ఎదురైతే భయపడకుండా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లలో గేమ్స్ ఆడుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని, సెల్‌ఫోన్లను అవసరానికి మాత్రమే వినియోగించుకోవాలని, వాటికి బానిసలు కావద్దని హితవు పలికారు. ముఖ్యంగా బాలికలు తమ వ్యక్తిగత ఫొటోలను పరిచయం లేని వ్యక్తులకు పంపరాదని హెచ్చరించారు. బహుమతుల పేరుతో వచ్చే నకిలీ సందేశాలను నమ్మవద్దని, ఎవరైనా ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని మంచి జీవితాన్ని గడపవచ్చన్నారు. తమ పరిసరాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి కూడా అవగాహన కల్పించి నేరరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాములు, పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్, ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, లక్ష్మీ ప్రసన్న, సల్మా జాఫర్, నాజియా సుల్తానా, రుబీనా ఖాజా పాల్గొన్నారు.



పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్.. 200 ఇళ్లలో తనిఖీలు

-- రూ.25,460 జరిమానా వసూలు..
3 వాహనాలు సీజ్
- అక్రమ మద్యంపై 4 కేసులు నమోదు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున కొత్తగూడెం రామా టాకీస్ ప్రాంతం, నెహ్రూ బస్తీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ నేతృత్వంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో పోలీసులు సుమారు 200 ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు 82 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 21 వాహనాలపై జరిమానాలు విధించారు. మొత్తం 151 చలాన్ల ద్వారా రూ.25,460 జరిమానా వసూలు చేశారు. సరైన పత్రాలు లేని మూడు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ మద్యం (ఐఎంఎఫ్ఎల్)కు సంబంధించి నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ... ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మూఢనమ్మకాలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు అవసరమైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు, ఓటీపీ మోసాల బారిన పడవద్దని హెచ్చరించారు. బ్యాంకు వివరాలు, ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపునకు ఇళ్ల వద్ద, కాలనీల్లోని ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఎస్సైలు, కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



జపాన్‌లో జైకా అధ్యయన పర్యటనను విజయవంతంగా పూర్తి చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, నీతి ఆయోగ్, జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) సంయుక్తంగా ఆకాంక్షిత మండలాల కార్యక్రమం కింద జపాన్‌లో నిర్వహించిన అధ్యయన పర్యటనను విజయవంతంగా పూర్తి చేశారు. నవంబర్ 15 నుంచి 21 వరకు జరిగిన ఈ పర్యటన ముగింపు కార్యక్రమంలో పాల్గొని ధ్రువపత్రాన్ని అందుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా కలెక్టర్ తన బృందంతో కలిసి నెరిమా నగరంలోని టొయోటామా ప్రాథమిక పాఠశాల సందర్శన అనుభవాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అక్కడి విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాల నిర్వహణ విధానాలను వివరించారు. అలాగే స్థానిక పాలన, ప్రభుత్వ సేవల అందజేత, ప్రజా భాగస్వామ్యంపై జరిగిన అధ్యయన సమావేశాలు, క్షేత్ర సందర్శనల్లో పాల్గొన్నారు. మిటో నగరం, సోనీ సంస్థలపై నిర్వహించిన కేస్ స్టడీలను అధ్యయనం చేశారు.జపాన్‌లో నేర్చుకున్న ఉత్తమ విధానాల్లో జిల్లాకు అనువైన అంశాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆకాంక్షిత మండలాల్లో విద్య, ఆరోగ్యం, పోషణ రంగాల్లో సేవల నాణ్యత మెరుగుదలకు ఈ అధ్యయన అనుభవాలు ఉపయోగపడనున్నాయి.

ఎర్త్ సైన్సెస్ వర్సిటీ అభివృద్ధికి రోడ్ మ్యాప్

- పూర్వ విద్యార్థి బిక్కి రమేష్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : తెలంగాణకే తలమానికంగా నిలిచిన కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైనింగ్ (కెఎస్ఎం) 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సుమారు 200 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేఎస్ఎంలో బీటెక్ మైనింగ్, ఎంటెక్ మైనింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థి బిక్కి రమేష్ మీడియాతో మాట్లాడుతూ... 1976లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కొత్తగూడెంకు తరలించి ప్రారంభించిన కేఎస్ఎం 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మైనింగ్, సాంకేతిక రంగాల్లో వస్తున్న ఆధునిక మార్పులు, అభివృద్ధిపై ప్రస్తుత విద్యార్థులకు అవగాహన కల్పించడమే వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అదేవిధంగా దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని భవిష్యత్తులో ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై పూర్వ విద్యార్థులంతా చర్చించినట్లు వెల్లడించారు. యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన సూచనలు, ప్రణాళికలతో ప్రత్యేక రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నామని, మరో రెండు మూడు నెలల్లో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు బిక్కి రమేష్ తెలిపారు. మైనింగ్ కోర్సులతో పాటు ఇంజనీరింగ్, జియాలజీ వంటి ఇతర కోర్సులను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైనింగ్‌లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి చేశారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో యూనివర్సిటీ ఏర్పాటు సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్వ విద్యార్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో 1633వ మొక్క నాటిన వనజీవి విశ్వామిత్ర చౌహాన్



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : చెట్టు నాటడం అంటే కేవలం మొక్క నాటడం కాదని, భావితరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువును పంచడమేనని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ టి. జగన్మోహన్ రాజు అన్నారు. యూనివర్సిటీ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ (గోల్డెన్ జూబ్లీ) వేడుకల్లో భాగంగా, చిన్నారి పర్యావరణ ప్రేమికుడు వనజీవి విశ్వామిత్ర చౌహాన్ తన 'వాక్ ఫర్ ట్రీస్' యజ్ఞంలో 1633వ మొక్కను నాటారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆవరణంలో కదంబ, అరుదైన పింక్ పనస మొక్కలను నాటి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ... ఎండ, వాన, చలి లెక్కచేయకుండా కఠిన దీక్షతో చౌహాన్ చేస్తున్న పర్యావరణ కృషి నేటి యువతకు ఎంతో ఆదర్శమని కొనియాడారు. చౌహాన్ దేశానికి ప్రకృతి ప్రసాదించిన అపురూప సంపదని, భవిష్యత్తులో యూనివర్సిటీలో మరిన్ని మొక్కలు నాటేందుకు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపల్ డాక్టర్ టి. జగన్మోహన్ రాజు, వనజీవి విశ్వామిత్ర చౌహాన్, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చౌహాన్‌ను అభినందించారు.

పేద కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత భీమా కొండంత అండ

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : చుంచుపల్లి మండలం బాబు క్యాంపులో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా నమోదును శనివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. పేద కుటుంబాలకు ఈ భీమా అండగా నిలుస్తుందని, అర్హులందరికీ పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిపిఓ బి.అనూష, ఎంపిడిఓ శుభాషిణి, పంచాయతీ అధికారి సంధ్య, కార్యదర్శి బర్ల ప్రభాకర్, నాయకులు దుర్గరాసి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి మురళి, జె.గట్టయ్య, ప్రజా ప్రతినిధులు నూనావత్ కుమారి, పొలమూరి శ్రీనివాస్, ధనలక్ష్మి, హరిత, శాంతిశ్రీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ మైన్స్ 50 ఏళ్ల ప్రస్థానం గర్వకారణం

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : 1976లో ఏర్పాటైన స్కూల్ ఆఫ్ మైన్స్ 50 ఏళ్లుగా మైనింగ్ రంగానికి నైపుణ్య వనరులను అందిస్తూ దేశానికి సేవ చేయడం గర్వకారణమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్వర్ణోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. వర్సిటీకి పూర్తిస్థాయి వీసీ, ఫ్యాకల్టీ నియామకం, బడ్జెట్ లోని రూ.250 కోట్లతో ఆధునిక వసతులు కల్పించాలని, 50-60 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాల స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తామని, సంస్థ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ అభివృద్ధి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21 (భద్రాద్రి న్యూస్) : 1976లో ప్రారంభమైన కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ స్వర్ణోత్సవ వేడుకలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ - డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ప్రపంచ స్థాయి ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా తీర్చిదిద్దుతామన్నారు. త్వరలో పూర్తిస్థాయి వీసీ, బోధనా సిబ్బంది నియామకాలు, మాస్టర్ ప్లాన్ ఆమోదం, ఆధునిక ల్యాబ్ లు, భవనాలు, గ్రంథాలయం, వసతి సముదాయాల నిర్మాణం చేపడతామన్నారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్ఎండీసీ, ఐఐటీల సహకారంతో నిధులు, సాంకేతిక సహకారం సమకూరుస్తామని, హైదరాబాద్ లో సమగ్ర రోడ్ మ్యాప్ కోసం సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థుల సహకారం అందించాలని కోరారు.ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ లో రూ.250 కోట్ల కేటాయింపు ప్రతిపాదన ఉందని, 50-60 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా స్టేడియం ప్రతిపాదన ఉందని తెలిపారు. అనంతరం మంత్రి మైనింగ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్టూడెంట్ చాప్టర్ ను ప్రారంభించి సర్టిఫికెట్లు అందజేశారు.